సాక్షి శ్రీకాకుళం

సోమవారం । 10 । ఫిబ్రవరి । 2025



ఇన్‌చార్జిల పాలన ఇంకెన్నాళ్లు.?

మండలాల్లో ఇన్‌చార్జిల పాలన కొనసాగుతోంది. తహసీల్దార్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి.

- 8లో



పేదింట పెద్ద కష్టం

విద్యార్థిని బ్రెయిన్ స్ట్రోక్‌కు గురైంది. చికిత్స కోసం సాయం కోరుతున్నారు.

- 8లో

అమానుషం

కాశీబుగ్గ: పలాస మండలంలో ఓ మారుమూల గ్రామానికి చెందిన ఇరవై ఏడేళ్ల దివ్యాంగురాలు గర్భం దాల్చింది. ఆమెకు కాళ్లు, చేతులు పనిచేయవు. మాటలు కూడా సరిగా రావు. నెలసరి సమస్యపై ఆస్పత్రికి తీసుకెళ్తే గర్భం దాల్చినట్లు తెలిసింది. దీంతో పెద్ద మనుషుల సమక్షంలో ఆమెతో పాటు కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

న్యూస్‌రీల్

కింగ్‌కోబ్రా కలకలం



మరుగుదొడ్డిలో కింగ్ కోబ్రా

కాశీబుగ్గ: మందస మండలం చిన్నకోష్ట గ్రామంలో శనివారం రాత్రి కింగ్ కోబ్రా కలకలం రేపింది. గ్రామానికి చెందిన రాయిక భరత్ అనే వ్యక్తి ఇంటిలోని స్నానాల గదిలో సుమారు పది అడుగులు ఉన్న కింగ్ కోబ్రా ప్రత్యక్షమైంది. దీంతో వారు భయభ్రాంతులకు గురయ్యారు. స్థానిక అటవీ ప్రాంతం నుంచి ఇంటిలోకి కింగ్ కోబ్రా చొరబడి ఉండవచ్చని భావిస్తున్నారు. భయాందోళనకు గురైన స్థానికులు సమాచారాన్ని అటవీశాఖ అధికారులకు అందజేశారు.

జయహో.. రాజమ్మ తల్లి



రాజమ్మ తల్లిని దర్శించుకుంటున్న భక్తులు

గార: మండలంలోని చిన వత్సవలసలో కొలువున్న రాజమ్మ తల్లి (రాజరాజేశ్వరి) దర్శనానికి తొలి వారం ఉత్తరాంధ్ర జిల్లాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చారు. శనివారం రాత్రికి వచ్చిన భక్తులు సమీప తోటల్లోనూ, ఆరుబయట బసచేసి రాజరాజేశ్వరి (రాజమ్మ తల్లి) పాటు భూలోకమ్మ తల్లికి ఆదివారం ఉదయం మొక్కులు తీర్చుకున్నారు. వేకువ జామున సమీపంలోని సముద్రంలో స్నానాలాచరించారు. కుటుంబ సమేతంగా విచ్చేసి ఇక్కడే వంటలు చేసుకొని అమ్మవారి దర్శనం చేసుకున్నారు. ఆది పీఠంలో ఒకటైన మైలపిల్లి శ్రీనివాసదాసుడు ఇంట్లో సంబరాలు జరగ్గా, మరి కొన్ని ఆదిపీఠాలైన పేరయ్య, జయమ్మ తదితర దాసుళ్ల ఇంటి వద్ద సంబరం జరిగింది. తొలి వారం జాతరకు శ్రీకాకుళం పట్టణ సీఐ పైడపు నాయుడు, ఎస్ఐ ఆర్.జనార్దన్ ఆధ్వర్యంలో 90 మంది పోలీసులు విధుల్లో పాల్గొన్నారు.

కళలు చరిత్రకు సాక్ష్యాలు



మాట్లాడుతున్న కేంద్ర మంత్రి రామ్మోహన్‌నాయుడు

ఆమదాలవలస : కళలు చరిత్రకు సాక్ష్యాలుగా నిలుస్తాయని కేంద్రమంత్రి కె.రామ్మోహన్‌నాయుడు అన్నారు. పట్టణంలోని పాలపోలమ్మ ఆలయం ఆవరణలో ఉభయ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీల్లో భాగంగా 3వ రోజు ఆదివారం నిర్వహించిన కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఆమదాలవలస రంగస్థల కళాకారుల సంఘ అధ్యక్ష కార్యదర్శులు తమ్మినేని విద్యాసాగర్, పేడాడ ప్రతాప్ కుమార్‌లను ఆయన అభినందించారు. స్థానిక ఎమ్మెల్యే కూన రవికుమార్ కూడా మాట్లాడారు. కళా ప్రాంగణం నిర్మిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కళాకారులను సత్కరించారు. అనంతరం ఏపీ, తెలంగాణకు చెందిన మూడు నాటికలను ప్రదర్శించారు.

కుంభమేళాకు 16న మరో స్పెషల్ బస్సు

శ్రీకాకుళం అర్బన్: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగలో జరుగుతున్న కుంభమేళాకు వేసిన బస్సు సర్వీసులకు అనూహ్య స్పందన వస్తోందని జిల్లా ప్రజా రవాణా అధికారి ఎ.విజయ్ కుమార్ తెలిపారు. శ్రీకాకుళం నుంచి మహా కుంభమేళాలో పుణ్య స్నానాలకు 16న మరో ప్రత్యేక సర్వీసును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఫిబ్రవరి 16న శ్రీకాకుళం బస్ స్టేషన్ నుంచి రాత్రి 8 గంటలకు బస్సు బయల్దేరుతుందన్నారు. మొత్తం 7 రోజుల్లో మొదటి రోజు రాత్రి శ్రీకాకుళంలో బయల్దేరి రెండో రోజు ఉదయానికి పూరి చేరుకుంటుందని, పూరీలో జగన్నాథ స్వామి వారి దర్శనం, కోణార్క్, సాయంత్రం భువనేశ్వర్‌లో గల లింగరాజ్ ఆలయం దర్శించుకున్న తర్వాత నేరుగా మూడో రోజు సాయంత్రానికి ప్రయాగ్ రాజ్ చేరుకుంటుందని పేర్కొన్నారు. నాల్గో రోజు ప్రయాగ్ రాజ్ త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరించిన తర్వాత అదే రోజు రాత్రి బయల్దేరి ఐదో రోజు ఉదయానికి వారణాశి చేరుకుంటుందన్నారు. కాశీ విశ్వేశ్వరుడిని దర్శించిన అనంతరం ఆరో రోజు ఉదయం వారణాశి నుంచి బయలుదేరి గయ, బుద్ధ గయ క్షేత్రాల దర్శనానంతరం ఏడో రోజు రాత్రికి శ్రీకాకుళం చేరుకుంటుందని తెలిపారు. మనిషి ఒక్కరికి టికెట్ ధర రూ. 9,500 అని తెలిపారు. యాత్రికులకు మధ్యాహ్నం భోజనం, ఉదయం, రాత్రి అల్పాహారం ఏర్పాటు చేస్తామన్నారు. వసతి ఖర్చులన్నీ యాత్రికులే భరించాల్సి ఉంటుందన్నారు. వివరాలకు 9959225608, 9959235609, 9959225610, 9959225611, 73829 17289, 7382921647, 7382923311, 7382924758 నంబర్లను సంప్రదించాలన్నారు.

అయిన వారికి ప్రాధాన్యం ▸ కాని వారికి దైన్యం

- మిల్లులకు ధాన్యం కేటాయింపుల్లో వివక్ష
- అందరికీ సమానంగా అందని 'ప్రసాద్'ం
- అంతా తానై వ్యవహరించిన కీలక నేత సోదరుడు
- ఆయన కనుసన్నల్లో మిల్లులకు కేటాయింపులు
- అయిన వారికి రూ. కోట్లలో లబ్ధి
- కాని వారికి రూ. లక్షల్లో నష్టం



సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం :

ధాన్యం కొనుగోళ్లలో తవ్వే కొద్దీ కొత్తకొత్త అక్రమాలు బయటపడుతున్నాయి. మిల్లులకు జరిగిన కేటాయింపులపై విచారణ జరిపితే జిల్లాలో రూ.వందల కోట్ల స్కామ్ బయటపడుతుంది. అధికార పార్టీ నేతల కనుసన్నల్లో జరిగిన ఖరీఫ్ ధాన్యం సేకరణలో భారీగా అక్రమాలు జరిగాయి. అసలైన రైతులకు నష్టం వాటిల్లగా... దగా చేసిన నేతలకు రూ.కోట్లు కుమ్మరించాయి. ఒక్క రైతుల్నే కాదు జిల్లాలో మెజారిటీ మిల్లర్లను కూడా మోసం చేశారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని సీఎంఆర్ కోసం మిల్లర్లకు చేసిన కేటాయింపుల్లోనూ వివక్ష చూపించారు. తమకు కావాల్సిన మిల్లులకు ఎక్కువగా ధాన్యం కేటాయించి కాని వారికి తక్కువ కేటాయించారు. దీంతో కొందరు మిల్లర్లకు నిర్వహణ ఖర్చులు కూడా రాని పరిస్థితి ఉండగా, మరికొందరు మిల్లర్లకు ఉన్న ఫలంగా రూ. కోట్లు వచ్చేలా జిల్లాలోని కీలక నేత సోదరుడు పావులు కదిపాడు. ఏ మిల్లుకు ఎంత ధాన్యం ఇవ్వాలో తానే డిసైడ్ చేశాడు. అధికారుల పాత్ర పక్కన పెడితే జరిగిన బాగోతాన్ని మిల్లర్లు కూడా చేతులు కట్టుకుని చోద్యం చూడాల్సి వచ్చింది.

జిల్లాలో ఈ ఏడాది ఖరీఫ్‌లో రైతుల నుంచి 4లక్షల 90వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేయాలని మొదట లక్ష్యం నిర్దేశించారు. రైతుల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని జిల్లాలోని 266 మిల్లులకు కేటాయించాలి. వాటి సామర్థ్యం మేరకు, వారిచ్చిన బ్యాంకు గ్యారంటీ మేరకు కేటాయింపులు చేయాల్సి ఉంటుంది. గత మూడు సంవత్సరాల సరాసరి కేటాయింపుల ఆధారంగా కేటాయింపులు చేయాలి. కానీ, ఈ సారి కీలక నేత సోదరుడు రంగ ప్రవేశం చేయడంతో మిల్లర్లు నిశ్చేష్టులైపోయారు. ఆయన చెప్పిందే జరగాలని శాసనం చేశారు. అందుకు తగ్గట్టుగానే అధికారులు కేటాయింపులు చేశారు. మూడేళ్ల సరాసరి కేటాయింపుల్లో 20 శాతం తగ్గించి తమకు కాని వారి మిల్లులకు కేటాయింపులు చేయగా, తమకు కావాల్సిన వారికి 100శాతం, 50 శాతం, 20శాతం ఎక్కువగా కేటాయించారు. రైస్ మిల్లర్ల అసోసియేషన్‌లో ఒక తీర్మానం ఉంది. 75 ఏసీకేల కంటే ఎక్కువ కేటాయించకూడదు. ఒక ఏసీకే 290క్వింటాళ్లతో సమానం. కానీ ఈ సారి ఆ తీర్మానాన్ని పక్కన పెట్టి తమకు నచ్చినోళ్లకు అంతకు మించి ఇవ్వగా, నచ్చని వాళ్లకు కనిష్ట స్థాయిలో కేటాయింపులు చేశారు.

ఈ విధంగా జనవరి 22వ తేదీ వరకు మొదట విడతగా జిల్లాలోని 266మిల్లులకు 4లక్షల 4వేల 421 మెట్రిక్ టన్నుల మేర మిల్లులకు కేటాయింపులు చేశారు. ఆ తర్వాత రెండో విడతలో మరో 86వేల మెట్రిక్ టన్నులకు కేటాయింపులు చేశారు. ప్రభుత్వం మరో 20వేల టన్నులు అదనంగా కొనుగోలు చేయడానికి నిర్ణయం తీసుకుంది. దీంతో మూడో విడతగా 20వేల టన్నుల మేరకు కేటాయింపులు చేశారు. మొదట విడతగా చేసిన 4లక్షల 4వేల 421మెట్రిక్ టన్నులకు మాత్రమే కేటాయింపుల జాబితా బయటకు వచ్చింది. మిగతా రెండు విడతల్లో చేసిన కేటాయింపుల వివరాలు బయటకు రాలేదు. దీంతో రెండు, మూడో విడతల కేటాయింపుల్లో ఎవరికెన్ని వచ్చాయో ఆ మిల్లర్లకు, కీలక నేతకు, తలూపే అధికారులకు తప్ప మరెవరికీ తెలియదు.

మొదటి విడతగా జనవరి 22వ తేదీవరకు చేసిన కేటాయింపుల(4లక్షల 4వేల 421మెట్రిక్ టన్నుల)ను తీసుకుంటే కొందరికి అన్యాయం జరగ్గా... మరికొందరికి రూ.కోట్లు కుమ్మరించే లబ్ధి చేకూర్చారు. 75ఏసీకేలే అత్యధికంగా కేటాయించాలన్న సంప్రదాయాన్ని పక్కన పెట్టి తమకు కావాల్సిన వారికి 114ఏసీకేల వరకు కేటాయించారు. ఎక్కువగా కేటాయింపులు దక్కించుకున్న వారంతా టీడీపీకి చెందిన వారే కావడం గమనార్హం. ఉదాహరణకు తీసుకుంటే కోటబొమ్మాళి మండలంలోని ప్రేమ ఇండస్ట్రీస్‌కు 112.09ఏసీకేలు, శ్రీ సూర్య రత్న మోడరన్ రైస్ మిల్లుకు 112.25ఏసీకేలు, శ్రీ కృష్ణ మోడరన్ రైసు మిల్లుకు 106.93ఏసీకేలు, నందిగాంలోని శ్రీ వెంకటేశ్వర ఎంఆర్ఎంకు 112.05ఏసీకేలు, శ్రీ లక్ష్మీ నర్సింహ ఆగ్రో ఇండస్ట్రీస్‌కు 109.13ఏసీకేలు, జలుమూరులోని శ్రీ వెంకట శాంతమణి ఎంఆర్ఎంకు 111.98ఏసీకేలు, ఎండల కామేశ్వరస్వామి రైస్ మిల్లుకు 111.45ఏసీకేలు, ఎల్ఎన్‌పేటలోని శ్రీనివాస్ ఎంఆర్ఎంకు 104.50 ఏసీకేలు, నరసన్నపేటలోని శ్రీ వెంకట లక్ష్మీ రైస్ మిల్లుకు 112.36ఏసీకేలు, శ్రీలక్ష్మీ నాగేశ్వర మిల్లుకు 111.98ఏసీకేలు, శ్రీ శాంతామణి ఇండస్ట్రీస్‌కు 104.46ఏసీకేలు, శ్రీ శాంతారాం ఎంఆర్ఎంకు 103.89ఏసీకేలు, శ్రీ సీతారాం ఎంఆర్ఎంకు 109.73ఏసీకేలు, సంతబొమ్మాళి జానకీరామ ఎంఆర్ఎంకు 109.02ఏసీకేలు, సారవకోటలోని శ్రీ సాయి శ్రీనివాస ఎంఆర్ఎంకు 104.50ఏసీకేలు, శ్రీకాకుళంలోని శ్రీ లక్ష్మీ గణపతి రైసు మిల్లుకు 102.60ఏసీకేలు, మారుతీ రైసు మిల్లుకు 102.36 ఏసీకేలు, సీతారామ రైసు మిల్లుకు 105.24ఏసీకేలు.. కేటాయించారు. వీరంతా మొదట విడతలో చేసిన కేటాయింపుల్లో అగ్రస్థానం దక్కిన వారిలో కొందరు. 75ఏసీకేలకు పైబడి కేటాయింపులు దక్కించుకున్న టీడీపీ నాయకుల మిల్లుల జాబితా చాలా ఉంది. ఇక, రెండు, మూడో విడతల్లో ఇవే మిల్లులకు అదనపు కేటాయింపులు చేశారు. ఎన్ని ఏసీకేలు కేటాయించారో అన్నదానిపై ఇంకా స్పష్టత రాలేదు. ఇవి కూడా కలిపితే వారి లబ్ధికి హద్దు లేదని చెప్పాలి.

కానివారిపై కక్ష

తమ పార్టీ కాని వారి మిల్లులకు, తటస్థంగా ఉండే మిల్లర్లకు తీవ్ర అన్యాయం జరిగింది. మొదటి విడతలో మూడు సంవత్సరాల సరాసరిలో 20శాతం తగ్గించి కేటాయింపులు చేశారు. ఈ కేటాయింపుల్లో కూడా చివరకు వచ్చేసరికి కోత పెట్టారు. దీని వల్ల వంద మంది మిల్లర్ల వరకు నష్టపోయారు. సాధారణంగా మిల్లర్లకు ఖరీఫ్ సీజన్ వస్తే పండగ. ఎందుకంటే, వారి నిర్వహణ వ్యయమంతా ఈ సీజన్‌లోనే సంపాదించుకుంటారు. సాధారణంగా ప్రతీ మిల్లు నిర్వహణకు సంవత్సరానికి రూ. 10నుంచి రూ. 15లక్షల వ్యయం అవుతుంది. ఆ పెట్టుబడి అంతా ఖరీఫ్ సీజన్‌లోనే తీసుకుంటారు. కానీ, కీలక నేత సోదరుడు దగ్గరుండి చేసిన కేటాయింపుల కారణంగా చాలా మంది మిల్లర్లు అన్యాయానికి గురయ్యారు. వారికి చేసిన కేటాయింపులతో మిల్లు నిర్వహణ ఖర్చులు రావని, బాగా నష్టపోతున్నామని కొందరు మిల్లర్లు వాపోతున్నారు. కాకపోతే, రోడ్డెక్కి చెప్పుకోలేకపోతున్నారు. ఏం మాట్లాడితే ఏం టార్గెట్ చేస్తారో ఏ రకంగా ఇబ్బంది పెడతారో అని కక్కలేక మింగలేక కుమిలిపోతున్నారు. ఈ మొత్తం వ్యవహారంలో బాగా లబ్ధిపొందిన వారు కీలక నేత సోదరుడే. ఆయనకు భారీగా ముడుపులు అందాయి. వాటికి కక్కుర్తిపడి చాలా మంది మిల్లర్లకు అన్యాయం చేశారని, తమ ఉసురు తప్పకుండా తగులుతుందని కొందరు మిల్లర్లు శాపనార్థాలు పెడుతున్నారు.

అరసవల్లిలో మాఘ మాస సందడి




ఆదిత్యుని ఆలయం ముందు భక్తుల రద్దీ

అరసవల్లి: మాఘ మాస ఆదివారం సందర్భంగా అరసవల్లి శ్రీసూర్యనారాయణ స్వామి సన్నిధి భక్తులతో కిటకిటలాడింది. సంప్రదాయం ప్రకారం ఇంద్రపుష్కరిణి ఒడ్డున సూర్యోదయ సమయం నుంచి వందలాది మంది మహిళలు తమ కుటుంబసభ్యులతో కలిసి పిడకల పొయ్యిపై క్షీరాన్నాన్ని వండి ఆదిత్యునికి ప్రసాదంగా నివేదించారు. అలాగే పలువురు భక్తులు చెరుకు, చలివిడి, పెసల మొలకలు, బెల్లం తదితర ప్రసాదాలను స్వామికి నివేదించారు. వత్సవలస రాజులమ్మ జాతర సందర్భంగా గ్రామీణ ప్రాంత భక్తులు భారీగా తరలిరావడంతో ట్రాఫిక్ అంతరాయం ఏర్పడింది. వన్‌టౌన్ సీఐ పైడపు నాయుడు ఆధ్వర్యంలో బందోబస్తు చర్యలు చేపట్టారు. ప్రసాదాల విక్రయాలు, మరుగుదొడ్లు, నిత్యాన్నదాన ప్రసాదం, బట్టలు మార్చుకునే గదులు, మంచినీటి అవసరాలు, ప్రత్యేక దర్శన టిక్కెట్లు విక్రయాలు జరిగే ప్రదేశాల సమాచారం తెలిసేలా బోర్డులు లేకపోవడంతో భక్తులు చాలావరకు ఇబ్బందులు పడ్డారు.

వివిధ దర్శనాల టిక్కెట్ల ద్వారా రూ.6,78,600, పూజలు, విరాళాల ద్వారా రూ.1,16,454, ప్రసాదాల విక్రయాల ద్వారా రూ.2.70 లక్షలు వరకు ఆదాయం లభించినట్లుగా ఆలయ ఈఓ వై.భద్రాజీ ప్రకటించారు. అలాగే విజయనగరం జిల్లా నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం మాధవి కూడా ఆదిత్యున్ని దర్శించుకున్నారు.

● ప్రమిదల వెన్నెల



నిద్దాం గ్రామంలో దీపోత్సవం అంబరాన్ని తాకింది. పదిహేనేళ్లుగా ఇక్కడ దీపోత్సవం జరుగుతోంది. ఆదివారం రాత్రి ఆలయ కమిటీ సభ్యులు, గ్రామస్తుల సహకారంతో లక్ష 20 వేల ప్రమిదలు, రెండు వేల కిలోల నూనెతో దీపోత్సవం నిర్వహించారు. - జి.సిగడాం

నేడు 'పరీక్షా పే చర్చ'





డీఈఓ డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య

శ్రీకాకుళం న్యూకాలనీ: దేశంలో విద్యాభివృద్ధికి తీసుకుంటున్న, తీసుకోబోతున్న చర్యలపై దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరీక్షా పే చర్చ కార్యక్రమంలో మాట్లాడబోతున్నారని జిల్లా విద్యాశాఖాధికారి డాక్టర్ ఎస్.తిరుమల చైతన్య పేర్కొన్నారు. ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఈ పరీక్షా పే చర్చ లైవ్ కార్యక్రమం సోమవారం ఉదయం 11 గంటలకు మొదలుకానుందని ఆయన చెప్పారు. ఆరు నుంచి పదో తరగతి, ఇంటర్మీడియెట్ విద్యార్థులకు పరీక్షలపై భయాన్ని తొలగించి, వారిలో సానుకూల దృక్పథాన్ని కల్పించేలా 'పరీక్షా పే చర్చ' పేరిట ఒక బృహత్తర కార్యక్రమం నిర్వహించాలని ప్రధానమంత్రి తలచడం చాలా గొప్ప విషయమన్నారు.

రిజిస్టర్ అయినవారంతా పాల్గొనాలి..

ఈ లైవ్ కార్యక్రమంలో యూట్యూబ్‌తోపాటు అన్ని టీవీ చానళ్ల ద్వారా ప్రత్యక్ష ప్రసారం జరుగుతున్నట్టు చెప్పారు. శ్రీకాకుళం జిల్లాలో ఈ కార్యక్రమంలో విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, లెక్చరర్లు వేలాదిమంది రిజిస్టర్ అయ్యారని చెప్పారు. ఆ సమస్యలను చర్చిస్తూ ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పరీక్షా పే చర్చ కార్యక్రమం నిర్వహిస్తున్నట్టు గుర్తుచేశారు. ఐఎఫ్‌పీ, స్మార్ట్ టీవీలు, కంప్యూటర్లలో ఎందులో వీలైతే అందులో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు వీక్షించేలా ఏర్పాట్లు చేసుకోవాలని సూచించారు. ఎంఈఓలు, హెచ్‌ఎంలు ప్రత్యేక చొరవ తీసుకుని ఎక్కువ మంది పాల్గొనేటట్టు చేయాలని ఆదేశించారు. చూస్తున్న లైవ్ కార్యక్రమాలను రెండు మూడు ఫొటోలు తీసి పాల్గొన్నవారి సంఖ్యను జత చేసి ఎస్‌సీఈఆర్టీ, ఎస్‌సీఈఆర్టీ వెబ్‌పోర్టల్‌లో వాటిని అప్‌లోడ్ చేయాలని ఆయన కోరారు.

జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ విజేత తామాడ ఏపీ మోడల్ స్కూల్



విద్యార్థులతో ఏపీ బయాలజీ ఫోరమ్ సంస్థ సభ్యులు, టెక్కలి డిప్యూటీ డీఈఓ తదితరులు

శ్రీకాకుళం: టాలెంట్ టెస్ట్‌ల వల్ల విద్యార్థుల్లో పోటీతత్వం పెరుగుతుందని టెక్కలి ఉప విద్యాశాఖాధికారి విలియమ్స్ అన్నారు. రాష్ట్ర బయాలజీ టీచర్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో గత నెల 4న నిర్వహించిన మండలస్థాయి టాలెంట్ టెస్ట్‌లో పాల్గొన్న ఉపాధ్యాయులను ఆయన ఆదివారం ప్రత్యేకంగా అభినందించారు. నగరంలోని ప్రభుత్వ మహిళా కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో 27 మండలాల టీమ్‌లు, 6 ఒడియా టీమ్‌ల ఉపాధ్యాయులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. జిల్లాస్థాయి టాలెంట్ టెస్ట్ విజేత తామాడ ఏపీ మోడల్ స్కూల్ కాగా, ద్వితీయ స్థానం రొంపివలస ఉన్నత పాఠశాల, తృతీయ స్థానం పెద్ద పద్మాపురం పాఠశాల విద్యార్థులు సాధించారు. ఒడియా విభాగంలో తొలి రెండు స్థానాల్లో టెక్కలి, ఈదుపురం పాఠశాలలు నిలవగా బహుమతులను అందించారు. కార్యక్రమంలో ఫోరమ్ జిల్లా అధ్యక్షుడు పుట్టా ఉదయకుమార్, ప్రధాన కార్యదర్శి పూజారి గోవిందరావు, నల్లా కుమారస్వామి, పరీక్షల కమీషనర్ అలియత్ ఖాన్‌లతో పాటు ప్రమోద్‌కుమార్, పాడి మురళీ, గొంటి గిరిధర్, మంచు కవిత, కె. గగనకుమారి, జి. మోషే, త్రివిక్రమరావు, లోకేశ్వరరావు, రేవతి, లోకనాథం, సోషల్ సైన్సు ఫోరమ్ జిల్లా కార్యదర్శి బాడాన రాజు, ఏపీటీఎఫ్ జిల్లా కార్యదర్శి బుక్కురు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. ఉమామహేశ్వరరావు మేజిక్ షో, తాడివలస విద్యార్థినుల స్కిట్ ఆకట్టుకున్నాయి.

18 మద్యం దుకాణాలకు దరఖాస్తుల స్వీకరణ పూర్తి



శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నూతన మద్యం పాలసీలో భాగంగా కల్లుగీత కులాలవారికి 10శాతం మద్యం దుకాణాలు కేటాయించినట్లు జిల్లా ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ అధికారి సీహెచ్ తిరుపతి నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. 16 మద్యం దుకాణాలకు గాను 166 దరఖాస్తులు వచ్చాయని, సొండి కులానికి కేటాయించిన 2 మద్యం దుకాణాలకు గాను 37, మొత్తం 18 దుకాణాలకు 203 దరఖాస్తులు ఆన్‌లైన్‌లో వచ్చాయని తెలిపారు. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎలక్షన్ కోడ్ ఆఫ్ కండక్ట్ వలన డ్రా వాయిదా వేయడం జరిగినట్లు తెలిపారు. తదుపరి తేదీని తెలియజేస్తామన్నారు.

రైతుకు ప్రత్యేక విశిష్ట గుర్తింపు నమోదుకు అవకాశం

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): భూమి కలిగిన ప్రతి రైతుకు ఒక ప్రత్యేక రైతు గుర్తింపు సంఖ్యను ఇవ్వడం జరుగుతుందని, దాని ద్వారా వ్యవసాయ సేవలను సులభతరం చేసి పారదర్శకంగా రైతులకు సేవలందిస్తామని జిల్లా వ్యవసాయాధికారి కె.త్రినాథ స్వామి అన్నారు. ఈ మేరకు ఆదివారం ఓ ప్రకటన విడుదల చేశారు. రైతు గుర్తింపు సంఖ్య అనేది రైతు రిజిస్ట్రీ పోర్టల్‌లో నమోదు చేసిన తర్వాత భూమి గల ప్రతి రైతుకు కేటాయించే ప్రత్యేక గుర్తింపు సంఖ్య అని తెలిపారు. భూ ఆధారిత పథకాలైన పీఎం కిసాన్ చెల్లింపులు, అన్నదాత సుఖీభవ, పంటల భీమా, పంట రుణాలపై వడ్డీ రాయితీ, రాయితీపై వ్యవసాయ యంత్ర పరికరాలు, రాయితీపై సూక్ష్మ పోషకాలు, సూక్ష్మసేద్యంపై రాయితీ, పంట రుణాలు, పెట్టుబడి సాయం వంటి పథకాలు నేరుగా పొందేందుకు అవకాశం ఉంటుందన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో భూమి గల ప్రతి రైతుకు, ముందు కౌలు రైతులకు, భూములేని వ్యవసాయ కూలీలు, ఇతర వ్యవసాయ ఆధారిత వృత్తులలో ఉన్న వారికి ఇది వర్తిస్తుందని వివరించారు.

నమోదు విధానం ఇలా....

ఆధార్ నంబర్, ఆధార్ అనుసంధానిత ఫోన్ నంబర్, భూమి రికార్డుల వివరాలు (పట్టాదారు పాస్ బుక్) తీసుకుని గ్రామంలో రైతు సేవా సిబ్బందిని కలిసి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని కోరారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయ ఉద్యమ కెరటం అచ్చన్నాయుడు



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ

శ్రీకాకుళం న్యూకాలనీ: ఉపాధ్యాయుల ఉద్యమ కెరటంగా దివంగత సువ్వారి అచ్చన్నాయుడు మాస్టర్ చిరస్థాయిగా నిలిచిపోతారని ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పాకలపాటి రఘువర్మ అన్నారు. నగరంలో డీసీసీబీ కాలనీలోని నవయుగ పాఠశాల సమీపంలో ఏపీటీఎఫ్ ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో అచ్చెన్నాయుడి సంతాప సభ ఆదివారం నిర్వహించారు. ఏపీటీఎఫ్ శ్రీకాకుళం జిల్లాశాఖ అధ్యక్షుడు మజ్జి మదన్‌మోహన్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ పాకలపాటి మాట్లాడుతూ.. పదిమందికి మంచిచేసి ఎదగడమే గొప్ప అనేది ఆయన సిద్ధాంతమని పేర్కొన్నారు. ఒక సామాన్యమైన రైతు కుటుంబంలో పుట్టి, ఉపాధ్యాయుడిగా ఉద్యోగం పొంది.. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం ఐదు దశాబ్దాలపాటు పోరాటాలు చేసిన అవిశ్రాంత శ్రామికుడిగా కీర్తించారు. ఏపీటీఎఫ్‌కి ఆయన చేసిన సేవలు మరువలేనివన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొప్పల భానుమూర్తి, ఆంధ్రప్రదేశ్ రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షురాలు కామ్రేడ్ ఎస్.ఝాన్సీ, పూర్వ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.పాండురంగ వరప్రసాదరావు, ఏపీటీఎఫ్ పూర్వ రాష్ట్ర కార్యదర్శి బి.వెంకటపతిరాజు తదితరులు పాల్గొన్నారు.

పీఆర్సీ ఎప్పుడిస్తారో చెప్పాలి

- ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్వీ రమణమూర్తి



మాట్లాడుతున్న జిల్లా ప్రధాన కార్యదర్శి రమణ

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలోని అనేక మంది ఉపాధ్యాయులు, ఉద్యోగులు పీఆర్సీ కోసం కోటి ఆశలతో ఎదురు చూస్తున్నారని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు ఎస్.వి.రమణమూర్తి పేర్కొన్నారు. నగరంలోని దాసరి క్రాంతి భవన్‌లో ఎస్టీయూ జిల్లా కార్యవర్గ సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 11వ వేతన సవరణ గడువు 2023 జూలై నాటికే ముగిసిందని, గడువు ముగిసి 20 నెలలు గడుస్తున్నా ఇంకా కూటమి ప్రభుత్వం ఎలాంటి ప్రకటన చేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఉద్యోగులకు రావాల్సిన బకాయిలపై అసలు ఒక్కమాట కూడా మాట్లాడకపోవడం శోచనీయమన్నారు. జిల్లా ప్రధాన కార్యదర్శి గురుగుబెల్లి రమణ మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే స్పందించి పీఆర్సీతోపాటు పెండింగ్ బకాయిలపై ప్రకటన చేయాలన్నారు. సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు పి.రామకృష్ణ, బి.సత్యం, కె.శ్రీనివాసరావు, కె.తేజేశ్వరరావు, ఎస్.లక్ష్మణరావు, జి.శ్రీనివాసరావు, రాజు, కె.కరుణకుమార్, డీవీఎస్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని బలోపేతం చేయండి

- బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి



మాట్లాడుతున్న ఏపీ బీజేపీ చీఫ్ పురందేశ్వరి

శ్రీకాకుళం న్యూకాలనీ: రాష్ట్రంలో భారతీయ జనతా పార్టీని సంస్థాగతంగా బలోపేతం చేయడానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, రాజమండ్రి ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. ఆదివారం సాయంత్రం శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని ఒక ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో ఆ పార్టీ జిల్లా నూతన అధ్యక్షుడు సిరిపురం తేజేశ్వరరావు అధ్యక్షతన బీజేపీ నూతన మండల అధ్యక్షులు, జిల్లాకు నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. దేశాన్ని పీఎం నరేంద్రమోదీ అభివృద్ధి బాటలో నడుపుతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర సంఘటన ప్రధాన కార్యదర్శి మధుకర్.జీ మాట్లాడుతూ మండల కమిటీలు, సంస్థాగత బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలను వివరించారు. కార్యక్రమంలో బీజేపీ ఉత్తరాంధ్ర జోనల్ ఇన్‌చార్జి గారపాటి సీతారామాంజనేయ చౌదరి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సాగి కాశీవిశ్వనాథరాజు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు, పైడి వేణుగోపాలం, నీలాపు విజయానందరెడ్డి, అట్టాడ రవిబాబ్జి, శవ్వాన ఉమామహేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అలరించిన నాటికలు



పక్కింటి మొగుడు నాటికలో సన్నివేశం

కవిటి: మండలంలోని బొరివంకలో జరుగుతున్న అంతర్రాష్ట్ర నాటిక పోటీల్లో భాగంగా రెండోరోజు ఆదివారం ప్రదర్శించిన పక్కింటి మొగుడు, చిగురుమేఘం నాటికలు ఆద్యంతం అలరించాయి. ప్రస్తుతం సమాజంలో పెరిగిపోతున్న స్వార్థం, అసూయతో మానవ సంబంధాలు దెబ్బతింటున్నాయని తెలియజేశారు. కార్యక్రమంలో కళింగ సీమ కళాపీఠం అధ్యక్షుడు బల్లెడ లక్ష్మణమూర్తి పాల్గొన్నారు.

ఇన్‌చార్జిల పాలన

ఇంకెన్నాళ్లు..?



- రెవెన్యూ వ్యవస్థలో సమస్యల తిష్ట
- తహసీల్దార్ల ఖాళీలతో ఇబ్బందులు
- పదోన్నతులు కల్పించకపోవడమే కారణం

శ్రీకాకుళం పాత బస్టాండ్: జిల్లాలో తహసీల్దార్లు పూర్తిస్థాయిలో లేకపోవడంతో రెవెన్యూ సమస్యలు పరిష్కారమవ్వక ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత రాజకీయ కక్షలు, సొంత హంగామా తప్ప ప్రజల సంక్షేమం, సుపరిపాలనపై దృష్టి పెట్టడం లేదు. దీంతో రాను రాను వ్యవస్థలు నిర్వీర్యమవుతున్నాయి. జిల్లాలో మొత్తం 30 మండలాలు ఉండగా, ఇందులో సుమారు పది మండలాల్లో తహసీల్దార్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఈ పోస్టులన్నీ ఇన్‌చార్జి పాలనలోనే నడుస్తున్నాయి. అలాగే రాష్ట్రవ్యాప్తంగా సుమారుగా 245 తహసీల్దార్ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. వాస్తవానికి ఈ ఖాళీలను ప్రోడీటీలు లేదా సీనియారిటీ ప్రకారం డిప్యూటీ తహసీల్దార్లకు పదోన్నతులు కల్పించి భర్తీ చేయాల్సి ఉంటుంది. ఈ దిశగా ప్రభుత్వం ఎటువంటి చర్యలు చేపట్టకపోవడంతో డిప్యూటీ తహసీల్దార్లు పదోన్నతుల కోసం ఎదురుచూస్తున్నారు.

175 మంది డిప్యూటీ తహసీల్దార్లు

జిల్లాలో సుమారుగా 175 మంది డిప్యూటీ తహసీల్దార్లు ఉన్నారు. వీరిలో 10 సంవత్సరాలు డీటీలుగా అనుభవం ఉన్నవారు 27 మంది ఉన్నారు. వీరందరూ అనుభవం, విద్యార్హతల మేరకు తహసీల్దార్ పదోన్నతులకు అర్హులే. అయినా ప్రభుత్వం ఆ దిశగా చర్యలు తీసుకోవడం లేదు. గతంలో వైఎస్సార్‌సీపీ అధికారంలో ఉన్నప్పుడు 2023 నవంబర్‌లో డిప్యూటీ తహసీల్దార్లకు పదోన్నతులు కల్పించింది. అయితే ప్రమోటెడ్ డీటీలు, ప్రోడీటీల మధ్య కోర్టులో వివాదం నడుస్తోంది. ఈ వివాదాన్ని సీసీఎల్ స్థాయిలో ప్రభుత్వం చొరవచూపి పరిష్కరించే అవకాశం ఉంది. అయినా కోర్టు పేరు చెప్పి మరింతకాలం కాలయాపన చేయొచ్చునని ప్రభుత్వం ఆలోచనలో ఉండడంతో ఆ సమస్య కొనసాగుతూనే ఉందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

రైతులకు ఇబ్బందులు

జిల్లాలోని పది మండలాల్లో పూర్తిస్థాయి తహసీల్దార్లు లేకపోవడంతో ఆయా మండలాల రైతులు రెవెన్యూ పనులు జరగక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధానంగా మ్యుటేషన్, సబ్ డివిజన్, రికార్డుల పర్యవేక్షణ, సర్వేలు వంటి రెవెన్యూకి సంబంధించి పనులు చేయడంలో చొరవ చూపడం లేదు. దీనికి తోడు మ్యుటేషన్లకు సంబంధించినటువంటి పోర్టల్‌లో అనేక నిబంధనలు పెట్టడంతో, ఆ ఫైల్స్ ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేసేందుకు ఇబ్బందులు పడుతున్నారు.

హడావుడిగా సదస్సులు

కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత హడావుడిగా రెవెన్యూ సమావేశాలు నిర్వహించడం తప్ప, పరిష్కారం వైపు అడుగులు వేయలేదు. ఆ సమావేశాల్లో జిల్లాకు సంబంధించి సుమారుగా 30,000 వరకు దరఖాస్తులు వచ్చాయి. ఇదంతా జరిగి మూడు నెలలు గడుస్తున్నా, సమస్యల పరిష్కారానికి ఎటువంటి చర్యలు ఇప్పటివరకు తీసుకోలేదు. అనంతరం జిల్లావ్యాప్తంగా అన్ని రెవెన్యూ గ్రామాల్లోనూ గ్రామసభలు నిర్వహించారు. వీటిలో రెవెన్యూ, సర్వేలకు సంబంధించిన ఫిర్యాదులను స్వీకరించారు. అప్పుడు కూడా సుమారుగా జిల్లా వ్యాప్తంగా 30 మండలాల్లో 27,000 వరకు రెవెన్యూ సమస్యలు రైతుల విన్నవించుకున్నారు. అయితే ఈ వినతుల పరిష్కారానికి కూడా చర్యలు లేవు. దీంతో జిల్లాలో ఉన్న రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

పేదింట పెద్ద కష్టం

- చదువులో రాణిస్తున్న అనూషకు బ్రెయిన్‌స్ట్రోక్
- మంచానికే పరిమితమైన ట్రిపుల్ ఐటీ విద్యార్థిని
- రెండు నెలలుగా వెంటిలేటర్‌పైనే చికిత్స
- దాతల సాయం కోసం ఎదురుచూపు



హాస్పిటల్‌లో వెంటిలేటర్‌పై ఉన్న అనూష వద్ద తల్లి గోవిందమ్మ (ఇన్‌సెట్లో) అనూష

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ):

పేదింట పెద్ద కష్టం వచ్చిపడింది. చదువులో విశేషంగా రాణిస్తున్న మురపాల అనూష అనే ట్రిపుల్ ఐటీ విద్యార్థిని బ్రెయిన్ స్ట్రోక్ బారిన పడి మృత్యువుతో పోరాడుతోంది. తన ప్రాణాలను కాపాడే దాతల సాయం కోసం ఎదురుచూస్తోంది. వివరాల్లోకి వెళ్తే.. శ్రీకాకుళం నగరం గుజరాతిపేటలో యాదవ కులానికి చెందిన గోవిందమ్మ ఇళ్లల్లో పాచి పనులు చేస్తుండగా.. తండ్రి ముత్యాలమ్మ మార్కెట్‌లో కలాసి పనులు చేసుకుని జీవనం సాగిస్తున్నారు. వీరి కుమార్తె అనూష. వరం మున్సిపల్ హైస్కూల్లో 10వ తరగతి వరకు చదివి 574 మార్కులు సాధించి స్కూల్ టాపర్‌గా నిలిచింది. దీంతో ట్రిపుల్ ఐటీ నూజివీడులో క్యాంపస్‌లో కంప్యూటర్ సైన్స్‌లో సీటు సంపాదించింది. మొదటి సంవత్సరం చదువుతుండగా 2024 డిసెంబర్ 19న రాత్రి బ్రెయిన్ స్ట్రోక్ వచ్చి కుప్పకూలిపోయింది. వెంటనే కాలేజీ యాజమాన్యం విజయవాడలో ఓ ప్రయివేటు హాస్పిటల్‌లో చేర్పించి డిసెంబర్ 20న ఆపరేషన్ చేయించారు. తల్లిదండ్రులు హుటాహుటిన హాస్పిటల్‌కి చేరుకున్నారు. ఆపరేషన్‌కు సుమారు రూ.12లక్షలు ఖర్చయిందని కాలేజీ యాజమాన్యం చెప్పారు. అనంతరం వెంటిలేటర్‌పై ఉన్న అనూషకు రోజుకు రూ.80 వేలు ఖర్చు చేస్తూ ఐదు రోజుల పాటు అక్కడే వైద్యసేవలు అందించారు. ఆ తర్వాత తల్లిదండ్రులకు అప్పగించడంతో అంబులెన్స్‌లో శ్రీకాకుళం నగరానికి తీసుకొచ్చారు. మెడికవర్, కిమ్స్, జెమ్స్‌లతో పాటు పలు ఆస్పత్రులను సంప్రదించగా ఎవ్వరు తక్కువ డబ్బులకు వైద్యం అందించలేమని చెప్పేశారు. దీంతో శ్రీకాకుళం నగరంలోని ఆర్ట్స్ కాలేజీ రోడ్డులోని ధరణి ఆస్పత్రి వైద్యులు ముందుకొచ్చి తక్కువ డబ్బులకు వెంటిలేటర్‌పై వైద్య సేవలందిస్తామని చేర్చుకున్నారు. ఇక్కడ కూడా రోజుకు రూ.30వేలు వరకు ఖర్చులు అవుతున్నాయి. దీంతో అంత ఖర్చుపెట్టే స్థోమత లేక తల్లిదండ్రులు తల్లడిల్లుతున్నారు. దాతలు ముందుకు వచ్చి తమ కుమార్తెకు ప్రాణభిక్ష పెట్టాలని వేడుకుంటున్నారు.

ఉత్సాహంగా బ్యాడ్మింటన్ పోటీలు



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో సంఘ బాధ్యులు సాగర్, అశోక్, సూరిబాబు

- జిల్లా నలుమూలల నుంచి క్రీడాకారులు హాజరు
- రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనవారి జాబితా వెల్లడి



హోరాహోరీగా సాగుతున్న పోటీలు

శ్రీకాకుళం న్యూకాలనీ: శ్రీకాకుళం జిల్లా షటిల్ బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నగరంలోని శాంతినగర్ కాలనీలో ఉన్న డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో జిల్లాస్థాయి మాస్టర్స్ బాడ్మింటన్ క్రీడాకారుల పోటీలు ఆదివారం ఉత్సాహంగా జరిగాయి. ఈ పోటీలకు జిల్లా నలుమూలల నుంచి వెటరన్ క్రీడాకారులు హాజరై తమ ప్రతిభ నిరూపించుకున్నారు. విజేతలుగా నిలిచిన క్రీడాకారులకు బ్యాడ్మింటన్ సంఘ ప్రతినిధులు బహుమతులు అందజేశారు. కాగా క్రీడాకారులకు హైదరాబాద్ మ్యాచ్ పాయింట్ బ్యాడ్మింటన్ అకాడమీ చైర్మన్ ముప్పాల వేణుగోపాల్ మెమెంటోలను, లక్ష్మీసింహాద్రి కన్‌స్ట్రక్షన్స్ చైర్మన్ గంజి భీమారావు క్రీడా దుస్తులను స్పాన్సర్ చేసి తమ దాతృత్వాన్ని మరోసారి చాటుకున్నారు.

రాష్ట్రస్థాయి పోటీల్లో సత్తాచాటండి

రాష్ట్రస్థాయి మాస్టర్స్ బాడ్మింటన్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో సత్తాచాటి విజేతలుగా నిలవాలని బ్యాడ్మింటన్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు కిల్లంశెట్టి సాగర్ పిలుపునిచ్చారు. జిల్లాస్థాయి పోటీల్లో విజేతలగా నిలిచిన క్రీడాకారులకు జిల్లా ప్రధాన కార్యదర్శి మెట్ట అశోక్‌కుమార్‌తో కలిసి బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రాష్ట్రస్థాయి పోటీల్లో సిక్కోలు క్రీడాఖ్యాతిని చాటిచెప్పాలని ఆకాంక్షించారు. జిల్లాలో బ్యాడ్మింటన్ అభివృద్ధికి చర్యలు తీసుకుంటామన్నారు. అన్ని పాఠశాలలకు బాడ్మింటన్ గేమ్ తీసుకెళ్లేలా ఏర్పాట్లు చేస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో బ్యాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా సీఈవో సంపతిరావు సూరిబాబు, గురుగుబెల్లి ప్రసాద్, చల్లా రమేష్(పలాస), మెండ శాంతికుమార్, గంజి భీమారావు, సీనియర్ క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎంపికైనవారు వీరే..

35+ విభాగంలో కిల్లీ హరీష్, శిమ్మ శైలజ, వై.లక్ష్మణరావు, హెచ్‌వీ ప్రసాద్, 40+ విభాగంలో ఎ.మోహనరావు, దుంపల రవికుమార్, ఎ.శ్రీకాంత్, సంపతిరావు పూర్ణిమరావు, 55+ విభాగంలో మెట్ట అశోక్ కుమార్, చేప రఘు, 60+ విభాగంలో ఆర్.కృష్ణారావు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు.

ఆప్కాస్ రద్దు నిర్ణయం విరమించుకోవాలి



మాట్లాడుతున్న సురేష్‌బాబు

శ్రీకాకుళం అర్బన్: ఆప్కాస్ రద్దు చేయాలని రాష్ట్ర మంత్రివర్గం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని ఆంధ్రప్రదేశ్ స్టేట్ గవర్నమెంట్ కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.సురేష్ బాబు కోరారు. ఈ మేరకు నగరంలోని ఎన్జీవో కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన 104 ఉద్యోగుల సమావేశంలో సురేష్‌బాబు ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. వేతనాలు, ప్రావిడెంట్ ఫండ్, ఈఎస్ఐ సక్రమంగా చెల్లించక దోపిడీ చేసినందువల్లనే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఆప్కాస్‌ను ఏర్పాటు చేసిందని గుర్తు చేశారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వ నిర్ణయం ఉద్యోగులను పెనం మీద నుంచి పొయ్యిలోకి తోసినట్లు చేసిందన్నారు మారుమూల గ్రామీణ ప్రజల వద్దకే వెళ్లి వైద్య సేవలు అందిస్తున్న 104 అవుట్ సోర్సింగ్ ఉద్యోస్తులందరినీ ప్రభుత్వం వైద్యశాఖ ద్వారా కాంట్రాక్ట్ పద్ధతిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగస్తులకు ఉద్యోగ భద్రతా, సమాన పనికి సమాన వేతనం కల్పించే విధింగా చర్యలు చేపట్టకపోతే ఆందోళన తప్పదని హెచ్చరించారు. త్వరలో జరగనున్న టీచర్స్ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కాంట్రాక్టు ఉపాధ్యాయులు, లెక్చరర్లు ప్రోగ్రెసివ్ డెమోక్రటిక్ ఫ్రంట్ అభ్యర్థిని కోరెడ్ల విజయకి ఓటువేసి గెలిపించాలని కోరారు. సమావేశంలో 104 ఉద్యోగుల సంఘ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ నారాయణ, జిల్లా ప్రధాన కార్యదర్శి డి.కిరణ్, కోశాధికారి సనపల నరేష్ కుమార్, ప్రతినిధులు వాసు, వెంకటరావు, బి.బాలకృష్ణ, శివ, గోవింద్, షణ్ముఖ, హరి, రమేష్, మోహన్ పాల్గొన్నారు.

క్షణికావేశంలో భార్యపై భర్త దాడి



దాడికి గురైన పావని

పొందూరు: క్షణికావేశంలో భార్యపై భర్త విచక్షణా రహితంగా దాడిచేసి హత్యాయత్నానికి పాల్పడిన ఘటన తాడివలస పీహెచ్‌సీ సమీపంలోని తోటలో చోటు చేసుకుంది. భార్య చనిపోయిందనుకుని భర్త పోలీసులకు లొంగిపోవడంతో ఘటన వెలుగులోకి వచ్చింది. వివరాల్లోకి వెళ్తే.. పొందూరు మండలంలోని లైదాం గ్రామానికి చెందిన గొర్లె సాయి ప్రసాద్‌కు సంతకవిటి మండలం బలరాంపేటకు చెందిన పావనితో వివాహం జరిగింది. వారికి 8 నెలల కుమారుడు ఉన్నాడు. సాయి ప్రసాద్ శ్రీకాకుళంలో డెలివరీ బాయ్‌గా పనిచేస్తూ కుటుంబంతో నివాసముంటున్నాడు. కొద్ది రోజులుగా భార్యాభర్తల మధ్య మనస్పర్థలతో గొడవలు జరుగుతున్నాయి. వీరు ఆదివారం కుమారుడుని ఇంట్లో విడిచిపెట్టి శ్రీముఖలింగం దర్శనానికి బైక్‌పై వెళ్లారు. కొత్తపేట కూడలి వద్ద ఇద్దరి మధ్య మాటామాటా పెరిగింది. దీంతో భార్య పావనిని తన కన్నవారి ఇంట్లో దించేస్తానంటూ తాడివలస మీదుగా సాయి ప్రసాద్ బైక్ తీసుకెళ్లాడు. అయితే తాడివలస పీహెచ్‌సీ సమీపంలో మరోసారి ఇద్దరి మధ్య మాటా మాటా పెరడగంతో భార్యను కొట్టి, చున్నీతో మెడ బిగించడంతో పావని స్పృహ కోల్పోయింది. భార్య చనిపోయిందని భావించిన శ్రీకాకుళంలోని ఎస్పీ కార్యాలయంలో లొంగిపోయాడు. అయితే అనంతరం స్పృలోకి వచ్చిన పావని బలరాంపేట చేరుకుని తల్లిదండ్రులతో పొందూరు పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసులు పావనికి పొందూరు సీహెచ్‌సీలో చికిత్స అందించారు. ఎస్ఐ వి.సత్యనారాయణ కేసు నమోదు చేశారు. సాయి ప్రసాద్‌ను అదుపులోకి తీసుకుని విచారణ జరుపుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



చికిత్స పొందుతున్న రాజేష్

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి సమీపంలోని జాతీయ రహదారిపై ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల మేరకు.. గుణుపూర్‌కి చెందిన భార్యాభర్తలు జామి రాజేష్, అఖిల తమ ద్విచక్ర వాహనంపై నరసన్నపేట నుంచి టెక్కలి వైపు వస్తుండగా, కోటబొమ్మాళి సమీపంలో వెనుక నుంచి వచ్చిన గుర్తు తెలియని వాహనం ఢీకొనడంతో ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న భార్యాభర్తలకు తీవ్రగాయాలవ్వడంతో కోటబొమ్మాళి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ ప్రథమ చికిత్స అనంతరం పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ఈ ఘటనపై కోటబొమ్మాళి పోలీసులు వివరాలు సేకరించి కేసు నమోదు చేయనున్నట్లు తెలిపారు.

వీవోఏల నూతన కమిటీ ఎన్నిక

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): నగరంలోని సీఐటీయూ కార్యాలయంలో వీవోఏల నూతన కార్యవర్గాన్ని ఆదివారం ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రతినెలా సకాలంలో వేతనాలు అందించాలని, పెరిగిన ధరలకు అనుగుణంగా వేతనాలు పెంచాలని కోరారు. అధికారంలోకి వస్తే వీవోఏల 3 సంవత్సరాల కాల పరిమితి సర్క్యులర్ రద్దు చేస్తామని, రాజకీయ వేధింపులు ఉండవని హామీ ఇచ్చిన కూటమి ప్రభుత్వం నేటికీ నెరవేర్చలేదన్నారు. వీవోఏలకు పనిభారం, యాప్‌ల భారం తగ్గించాలని కోరారు.

నూతన కార్యవర్గం

సంఘం జిల్లా గౌరవ అధ్యక్షురాలిగా అల్లు మహాలక్ష్మి, అధ్యక్షురాలిగా వర్రి ధనలక్ష్మి, జిల్లా ప్రధాన కారదర్శిగా గొండు అసిరినాయుడు, ఉపాధ్యక్షుడిగా దండుపాటి జోగారావు, ఉప కార్యదర్శిగా నొపడా రాజేశ్వరి, కోశాధికారిగా బిశెట్టి హేమలతతో పాటు 30 మందిని కార్యవర్గ సభ్యులుగా ఎన్నుకున్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం పాడుగుపాడు గ్రామానికి చెందిన కోట అప్పన్న(67) అనే వ్యక్తి పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు. మృతుడు కుమారుడు కోట ధనుంజయరావు ఆదివారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అప్పన్న గత కొంతకాలంగా కడుపు నొప్పితో బాధపడుతున్నాడని, పలు ప్రైవేట్, ప్రభుత్వ ఆస్పత్రుల్లో చికిత్స అందించినా తగ్గలేదని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో బాధను భరించలేక శుక్రవారం తన ఇంట్లో ఎవరూ లేని సమయంలో పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నానికి ప్రయత్నించాడు. ఇది గమనించిన అతని భార్య కనకమ్మ అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని స్థానికుల సాయంతో కోటబొమ్మాళి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. అక్కడ పరిస్థితి విషమంగా ఉండడంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్‌కు రిఫర్ చేశారు. అయితే అక్కడ చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందాడు.

గెస్ట్ లెక్చరర్లకు అన్యాయం..!

- ప్రాక్టికల్స్ డ్యూటీలు రద్దు చేస్తూ నిర్ణయం
- చివరి నిమిషంలో చెప్పిన అధికారులు
- విస్మయం వ్యక్తం చేస్తున్న మేధావులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ప్రైవేటు కాలేజీల్లో పనిచేస్తున్న లెక్చరర్లకు ఇంటర్మీడియెట్ పబ్లిక్ ఎగ్జామినేషన్స్ డ్యూటీలు, ఇన్విజిలేషన్, స్పాట్ వాల్యుయేషన్, చివరకు ప్రాక్టికల్స్ డ్యూటీలు సైతం వేస్తున్నారు. కానీ ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పదేళ్లగా పనిచేస్తున్న గెస్ట్ లెక్చరర్లకు మాత్రం అవకాశం కల్పించకుండా తీవ్రంగా అవమానపరుస్తున్నారు. తాజాగా కూటమి ప్రభుత్వం గెస్ట్ ఫ్యాకల్టీలకు ఇంటర్ బోర్డు వేసిన ప్రాక్టికల్ ఎక్స్‌ట్రనల్ డ్యూటీలను సైతం రద్దు చేసింది. దీంతో ఈ నిర్ణయాన్ని విద్యావేత్తలు, విశ్రాంత ప్రిన్సిపాల్స్ తీవ్రంగా తప్పుబడుతున్నారు.

పదేళ్లుగా తక్కువ జీతంతోనే...


2013–2014లో ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో కాంట్రాక్ట్ లెక్చరర్ల వ్యవస్థను నిలిపివేసిన తర్వాత గెస్ట్ లెక్చరర్ల పేరిట ఖాళీలను భర్తీ చేస్తున్నారు. పీరియడ్‌కు రూ.150లు చొప్పున నెలకు కేవలం రూ.10 వేల వేతనం చెల్లిస్తున్నారు. ఈవిధంగా జిల్లాలోని 30 జూనియర్ కాలేజీల్లో 118 మంది పనిచేస్తున్నారు. వీరు కూడా ఉదయం నుంచి సాయంత్రం వరకూ కాలేజీల్లోనే ఉంటూ, రెగ్యులర్ ఉద్యోగుల మాదిరిగానే ఎఫ్ఆర్ఎస్ ఫేసియల్ యాప్‌లను సైతం వేస్తున్నారు. కానీ విధి నిర్వహణలో, జీతాల చెల్లింపుల్లో తీవ్ర అన్యాయానికి గురవుతున్నారు. కనీసం పరీక్షలు, స్పాట్ వాల్యుయేషన్ సమయంలో వారికి కేటాయించాల్సిన డ్యూటీలను సైతం వేయకపోతుండడంపై తీవ్ర మనోవేదనకు గురవుతున్నారు.



జిల్లా ఆర్ఐవో కార్యాలయం

ఖంగుతిన్న లెక్చరర్లు

తాజాగా నందిగాం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జువాలజీ గెస్ట్ లెక్చరర్‌గా పనిచేస్తున్న దత్తి చంద్రయ్యను, ఈ ఏడాది వజ్రపుకొత్తూరు సమీపంలోని ఓ ప్రైవేటు కాలేజీలో ఈనెల 11 నుంచి జరిగే ప్రాక్టికల్స్‌లో భాగంగా జువాలజీ ఎగ్జామినర్‌గా ఇంటర్ బోర్డు అపాయింట్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. బోర్డు వెబ్‌సైట్ నుంచి ఆర్డర్ కాపీ వయా కాలేజీ లాగిన్ నుంచి ఆయన అందుకున్నారు. అయితే 9వ తేదీ సాయంత్రం జిల్లా ఆర్ఐవో కార్యాలయం నుంచి గెస్ట్ ఫ్యాకల్టీకి ప్రాక్టికల్ డ్యూటీలను రద్దు చేసినట్లు చెప్పడంతో ఖంగుతిన్నారు. ఈవిధంగా జిల్లాలో 28 మంది వరకు సైన్స్ లెక్చరర్లకు డ్యూటీలను రద్దు చేస్తున్నట్టు బోర్డు పెద్దలు నిర్ణయం తీసుకున్నారని తెలిసింది. దీంతో ప్రైవేటు కాలేజీల్లో పనిచేసే వారికి డ్యూటీలు కేటాయించి, తమను మాత్రం ఎందుకు దూరం పెడుతున్నారని వారు ప్రశ్నిస్తున్నారు. ఈ విషయంపై సీఎం, విద్యాశాఖమంత్రి, ఇంటర్ విద్య డైరక్టర్‌ను కలిసి న్యాయం చేయమని కోరుతామని సంఘ నాయకుడు బి.గణేష్ పేర్కొన్నారు.



అధికారుల నుంచి షేర్ అవుతున్న వాట్సాప్ మెసేజ్



దత్తి చంద్రయ్యకు జారీ చేసిన ప్రాక్టికల్ ఎగ్జామినర్ అపాయింట్‌మెంట్ ఆర్డర్ కాపీ